క్లుప్తంగా

ప్రశాంత వాతావరణంలో పండుగ జరుపుకోవాలి

• సీపీ అనురాధ

సిద్దిపేటకమాన్: ప్రశాంతమైన వాతావరణంలో దేవీనవరాత్రి ఉత్సవాలు జరుపుకోవాలని సీపీ అనురాధ పిలుపునిచ్చారు. గురువారం ఆమె మాట్లాడుతూ అమ్మవారిని భక్తిశ్రద్ధలతో పూజించాలన్నారు. జిల్లాలో మొత్తం 664 దుర్గామాత విగ్రహాలు ఏర్పాటు చేశారని చెప్పారు. మండపాల నిర్వాహకులు, కార్యవర్గ సభ్యులు పోలీసుల సూచనలు పాటించాలని, అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. విగ్రహ ప్రతిష్ఠ నుంచి నిమజ్జనం వరకు నిర్వాహకులు పూర్తిబాధ్యత వహించాలని, విగ్రహాలను జియో ట్యాగింగ్ చేస్తారని చెప్పారు. ఏ చిన్న సంఘటన జరిగినా సంబంధిత పోలీసుస్టేషన్ లేదా డయల్ 100కు కాల్ చేయాలని సూచించారు.

తాగునీటిని వృథా చేయొద్దు



మాట్లాడుతున్న డీపీఓ దేవకీదేవి

నంగునూరు(సిద్దిపేట): మిషన్ భగీరథ నీటిని వృథా చేయకుండా ఉండేలా ప్రజలకు అవగాహన కల్పించాలని డీపీఓ, మండల ప్రత్యేక అధికారి దేవకీదేవి సిబ్బందికి సూచించారు. మండలంలోని అన్ని గ్రామాల తాగునీటి సహాయకులకు గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మిషన్ భగీరథ నీటి సరఫరాకు అంతరాయం కలిగినా, లీకేజీలు ఏర్పడినా వెంటనే స్పందించి మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. అలాగే చేతిపంపుల వినియోగంపై అవగాహన కల్పించి నీటిని పొదుపుగా వాడుకునేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ డిప్యూటీ ఈఈ సుమలత, ఏఈ నర్సింగారావు, సూపరింటెండెంట్ ప్రభాకర్‌రావు, శిక్షకుడు శ్రీనివాసాచారి పాల్గొన్నారు.

గ్రామంలో సమస్యలు పరిష్కరించాలని వినతి

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని అయినాపూర్‌లో సమస్యలు పరిష్కరించాలని గ్రామస్తులు సీపీఎం ఆధ్వర్యంలో గ్రామ ప్రత్యేకాధికారి తహసీల్దార్ లక్ష్మీనారాయణకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డ్రైనేజీల నిర్వహణ సరిగాలేదని, దీంతో గ్రామంలో దోమలు, ఈగలు వ్యాప్తిచెంది అనేక మంది విషజ్వరాలతో బాధపడుతున్నారన్నారు. అలాగే రాత్రిపూట వీధిలైట్లు పూర్తిస్థాయిలో వెలగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే పండుగలను దృష్టిలో పెట్టుకొని సమస్యలను పరిష్కరించాలని ప్రత్యేకాధికారిని కోరారు. కార్యక్రమంలో యాదగిరి, ఎల్లయ్య, చంద్రయ్య, గోరేమియా పాల్గొన్నారు.

నల్లపోచమ్మ ఆలయాన్ని సందర్శించిన మాజీ ఎమ్మెల్యే



పనులను పరిశీలిస్తున్న కొమ్మూరి

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని నాగపురి శివారులో ఉన్న నల్లపోచమ్మ ఆలయాన్ని గురువారం మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాల్లో జరుగుతున్న మరమ్మతు పనులను పరిశీలించారు. పనుల నిర్వహణపై ఆరాతీశారు. అనంతరం మాట్లాడుతూ నల్లపోచమ్మ ఆలయ అభివృద్ధితో పాటు ప్రక్కనే ఉన్న చెరువు విషయంలో తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట ఆలయ చైర్మన్ గూడెపు మహేష్, పీఏసీఎస్ చైర్మన్ మేర్గు కృష్ణాగౌడ్, కొమ్ము రవి, మల్లన్న ఆలయ మాజీ చైర్మన్ పర్పాటకం లక్ష్మారెడ్డి ఉన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

గజ్వేల్‌రూరల్: టాస్క్‌ఫోర్స్, గజ్వేల్ పోలీసులు ఓ పేకాట స్థావరంపై దాడిచేసి గురువారం ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ప్రజ్ఞాపూర్‌లోని ఓ రియల్ ఎస్టేట్ కార్యాలయంలో కొందరు పేకాట ఆడుతున్నట్లు అందిన సమాచారం మేరకు సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, గజ్వేల్ పోలీసులు బుధవారం రాత్రి దాడిచేశారు. ఆరుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.77వేలు, ఆరు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు.

ఆర్థిక సాయం

సిద్దిపేటరూరల్: మండల పరిధిలోని పుల్లూరు గ్రామంలో అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న దుర్గమ్మ ఆలయ నిర్మాణానికి ప్రముఖ వ్యాపారవేత్త వంగ రాజేశ్వర్‌రెడ్డి రూ.40వేలు ఆర్థిక సహాయం అందించారు. ఆయనను సంఘం నేతలు సన్మానించారు. మాజీ ఎంపీటీసీ వెంకట్ యాదవ్, కనకయ్య, మల్లయ్య, నర్సింహులు పాల్గొన్నారు.



కొండపాక(గజ్వేల్): మల్లికార్జున స్వామి క్షేత్రంలో పూజలు నిర్వహిస్తున్న మహిళలు



నంగునూరు(సిద్దిపేట): పాలమాకులలో..



చిన్నకోడూరు(సిద్దిపేట): రామునిపట్లలో..

బాలాత్రిపుర సుందరిగా దుర్గమ్మ

అన్ని మండల కేంద్రాలు, గ్రామాల్లో శరన్నవరాత్రోత్సవాలు గురువారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయాలు, దుర్గామాత మండపాల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయాల్లో అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు నిర్వహించారు. బాలాత్రిపుర సుందరిదేవిగా దుర్గామాత దర్శనమిచ్చారు.



గజ్వేల్‌రూరల్: 108 చీరల అలంకరణలో కుమారీదేవిగా దర్శనమిస్తున్న మహంకాళి మాత



మద్దూరు(హుస్నాబాద్): లద్నూరులో అమ్మవారికి పూజలు



చేర్యాల(సిద్దిపేట): పూజల్లో పాల్గొన్న ఏకానందం దంపతులు



హుస్నాబాద్: మంగళహారతులతో మహిళలు



ఎర్ర చెరువు వద్ద పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల, డీఈ ప్రేరణ తదితరులు

చెరువుల వద్ద లైట్ల ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్

సిద్దిపేటజోన్: ఎంగిలి బతుకమ్మ సందర్భంగా పట్టణంలోని చెరువుల వద్ద విద్యుత్ దీపాలు, వసతుల కొరతపై మహిళలు పడిన ఇబ్బందులపై గురువారం సాక్షిలో ప్రచురించిన కథనానికి బల్దియా స్పందించింది. హుటాహుటిన మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల, డీఈ ప్రేరణ తదితరులు చెరువులను సందర్శించించారు. కోమటిచెరువు, ఎర్రచెరువు వద్ద లైట్లు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. అదేవిధంగా గుంతల్లో మట్టిపోసి తాత్కాలికంగా మరమ్మతులు చేయాలని, తాగునీరు అందుబాటులో ఉండేలా చూడాలని చైర్మన్ మంజుల అధికారులను ఆదేశించారు. చెరువుల వద్ద గజ ఈతగాళ్ళు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఆమె వెంట మాజీ చైర్మన్ రాజనర్స్, కౌన్సిలర్లు సుందర్, బ్రహ్మం, మల్లికార్జున్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు వనిత, మాధవి, ఏఈలు యాదగిరి, పృథ్వి, నాయకులు రాజు, సత్యం పాల్గొన్నారు.

చెట్లను నరికిన రైతుకు నోటీసు



రైతు ఇంటి గోడకు అతికించిన నోటీసు

కొండపాక(గజ్వేల్): కొండపాక, తొగుట సరిహద్దు మండల శివారులోని బీటీరోడ్డు పక్కన హరితహారం పథకంలో భాగంగా నాటిన చెట్లను ఓ రైతు నరకడంతో ఫారెస్టు అధికారులు నోటీసు జారీ చేశారు. ఖమ్మంపల్లి నుంచి పెద్ద మాసాన్‌పల్లికి వెళ్లే బీటీ రోడ్డు ప్రక్కన సుమారు కిలో మీటరు మేర ఎనిమిదేళ్ల క్రితం వివిధ రకాల చెట్లను నాటారు. ఓ రైతు వాటిని మెషిన్ సహాయంతో నరికాడు. దీనిపై 'పచ్చని చెట్లపై గొడ్డలి వేటు' అనే కథనాన్ని సెప్టెంబరు 25న సాక్షి దినపత్రికలో ప్రచురించింది. ఈ కథనానికి ఫారెస్టు అధికారులు స్పందించారు. చెట్లను నరికిన రైతుకు ఫోన్ చేయగా నిర్లక్ష్యంగా సమాధానం చెబుతూ వచ్చాడు. ఈ క్రమంలో రెండు రోజుల కిందట అధికారులు నోటీసు జారీచేయగా తీసుకోవడానికి నిరాకరించాడు. దీంతో అతడి ఇంటి గోడకు అతికించారు. అయినా స్పందించని రైతు తీరుపై ఫారెస్టు ఉన్నతాధికారులకు నివేదిస్తామని డీఆర్వో పద్మ తెలిపారు.

మాజీ ఎంపీపీకి ఎమ్మెల్యే పరామర్శ



కీర్తనను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రాజేశ్వర్ రెడ్డి

కొమురవెల్లి(సిద్దిపేట): మాజీ ఎంపీపీ తలారి కీర్తన మామ తలారి గాలయ్య గురువారం అనారోగ్యంతో మృతిచెందడంతో విషయం తెలుసుకున్న జనగామ ఎమ్మెల్యే రాజేశ్వర్‌రెడ్డి ఆ కుటుంబ సభ్యులను పరామర్శించారు. అంతిమ యాత్రలో పాల్గొన్నారు. కార్యక్రమంలోమాజీ జెడ్పీటీసీ సిద్దప్ప, వైస్ ఎంపీపీ కాయిత రాజేందర్ రెడ్డి, ముత్యం నర్సింహులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఇటీవల గురువన్నపేటలో అత్యాచారనికి గురైన బాలిక కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బాలిక కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

- అజెండా అంశాలకు ఏకగ్రీవ ఆమోదం
- చైర్‌పర్సన్ గన్నె వనితారెడ్డి
- హాజరైన ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక: దుబ్బాక మున్సిపాలిటీ అభివృద్ధికి అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటామని చైర్‌పర్సన్ గన్నె వనిత అన్నారు. గురువారం ఆమె అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించగా ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సమావేశంలో ప్రవేశపెట్టిన 13 అజెండా అంశాలను కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. గతంలో పనిచేసిన పారిశుద్ధ్య కార్మికుల బకాయి వేతనాలను ఇచ్చేందుకు నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం నెలకొన్న సమస్యలను పరిష్కరించడంతో పాటుగా అభివృద్ధి పనులకు అవసరమయ్యే నిధులు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరారు. ఆయన వెంటనే స్పందించి తప్పకుండా సీడీఎంఏ ద్వారా నిధులు మంజూరుకు కృషిచేస్తానని చెప్పారు. బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆదేశించారు. సమావేశంలో వైస్ చైర్‌పర్సన్ సుగుణ, కమిషనర్ రమేశ్‌కుమార్, అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటలతో లాభాలు

శాస్త్రవేత్త శ్రీదేవి



పత్తి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

సిద్దిపేటఅర్బన్: వరి పంటకు ప్రత్యామ్నాయంగా పొద్దుతిరుగుడు, మొక్కజొన్న, జొన్న, పెసర, మినుము, కూరగాయలు వంటివి సాగుచేసి రైతులు అధిక లాభాలు పొందాలని తోర్నాల వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్రీదేవి, ఏరువాక కేంద్రం కో-ఆర్డినేటర్ విజయ్ సూచించారు. అర్బన్ మండలం బక్రిచెప్యాల క్లస్టర్ రైతు వేదికలో యాసంగి సీజన్‌కు అనుకూలమైన ఆరుతడి పంటల సాగు, యాజమాన్య పద్ధతులపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రబీ సీజన్‌లో సెప్టెంబరు 15నుంచి అక్టోబరు 15వరకు పెసర, మినుము, కంది, ఆముదం పంటలను సాగు చేసుకోవచ్చన్నారు. అక్టోబరు 15నుంచి నవంబరు 15వరకు వేరుశనగ, శనగ, మొక్కజొన్న, తీపిమొక్కజొన్న, రాగులు, ఆవాలు, కుసుమ పంటలను సాగు చేసుకోవచ్చని సూచించారు. పొద్దుతిరుగుడు విత్తనాలను నవంబరు నుంచి డిసెంబరు వరకు, జొన్న విత్తనాలను డిసెంబరు చివరి వరకు విత్తుకోవచ్చని సూచించారు. ఏరువాక కేంద్రం కో-ఆర్డినేటర్ విజయ్ వివిధ పంటల్లో ఎదురయ్యే సమస్యలు వాటి నివారణ గురించి వివరించారు. అనంతరం శాస్త్రవేత్తల బృందం, ఏడీఏ పద్మ, మండల వ్యవసాయాధికారి శ్రీనాథ్‌తో కలిసి బక్రిచెప్యాల, నాంచారుపల్లి, బందారం, జప్తినాచారం, దోమలోనిపల్లి గ్రామాల్లో వరి, పత్తి, కంది పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు పల్లవి, ఉమారాణి, రమాదేవి, ఏఈవోలు మీరాబాయి, రాజేష్, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీనివాస్, పవన్, సంధ్య పాల్గొన్నారు.

బతుకమ్మ టెండర్లలో అవకతవకలు: బీఎస్పీ నేతలు

హుస్నాబాద్: పట్టణంలో బతుకమ్మ నిర్వహణ ఆన్‌లైన్ టెండర్ల అవకతవకలపై విచారణ చేపట్టాలని బీఎస్పీ నాయకులు డిమాండ్ చేశారు. ఆ పార్టీ కార్యాలయంలో గురువారం వారు మాట్లాడుతూ టెండర్ల వివరాలు నోటీస్ బోర్డుపై ప్రదర్శించకుండా రహస్యంగా ఓ కాంట్రాక్టర్ టెండర్ దక్కించుకున్నారన్నారు. కొత్తవారిని రాకుండా పట్టణానికి చెందిన కాంట్రాక్టర్లు అడ్డుకుంటూ అవకతవకలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కాంట్రాక్టర్ పేరిట కొంత మంది కౌన్సిలర్లు బతుకమ్మ నిర్వహణ పనులను దగ్గరుండి చేస్తున్నారని వాపోయారు. నియోజకవర్గ ఇన్‌చార్జి పచ్చిమట్ల రవీందర్ గౌడ్, నాయకులు శంకర్, వెంకటేశ్, సుధాకర్, రాంబాబు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ఇద్దరు మృతి

దుబ్బాకరూరల్: బైక్‌పై నుంచి పడిన ఓ మహిళ మృతి చెందిన ఘటన పోతారెడ్డిపేటలో చోటు చేసుకుంది. ఎస్ఐ హరీశ్ కథనం ప్రకారం.. మిరుదొడ్డి మండలం అల్వాల గ్రామానికి చెందిన గాద లక్ష్మి(40) గతనెల 25న తన కుమారుడితో కలిసి బైక్‌పై మెదక్ జిల్లా నిజాంపేట మండలం కల్వకుంట గ్రామంలోని తన బంధువుల ఇంటికి బయలుదేరారు. పోతారెడ్డిపేట వద్దకు రాగానే బైక్ అదుపుతప్పి కింద పడడంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే సిద్దిపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం గత నెల 28న గాంధీ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గజ్వేల్‌రూరల్: ఆర్థిక ఇబ్బందులతో పురుగుల మందు తాగి ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మండల పరిధిలోని ధర్మారెడ్డిపల్లిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన కేతిమల్ల అశోక్(41)కు భార్య మౌనికతో పాటు ఇద్దరు కొడుకులున్నారు. అశోక్ జీవనోపాధి కోసం తన కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్‌లోని నేరేడ్‌మెట్‌లో నివసిస్తున్నాడు. పెత్రమాస సందర్భంగా గ్రామానికి వచ్చాడు. ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న అశోక్ తీవ్ర మనోవేదనకు గురై బుధవారం తమ వ్యవసాయ బావివద్ద పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అది గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లగా మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తీసుకువెళ్ళారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మూడు రోజులపాటు 'డిజిటల్' సర్వే



అక్కన్నపేట(హుస్నాబాద్): సర్వేను పరిశీలిస్తున్న ఆర్డీఓ రామ్మూర్తి

ఆర్డీఓ రామ్మూర్తి

అక్కన్నపేట(హుస్నాబాద్)/దుబ్బాకటౌన్/నంగునూరు(సిద్దిపేట)/గజ్వేల్‌రూరల్/హుస్నాబాద్/దుబ్బాకరూరల్: పైలట్ ప్రాజెక్ట్ కింద డిజిటల్ కార్డుల జారీ ప్రక్రియకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా అక్కన్నపేట మండలం నందారం గ్రామంలో ఫ్యామిలీ డిజిటల్ కార్డుల కోసం అధికారులు మూడు బృందాలుగా ఏర్పడి గురువారం ఇంటింట సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ రామ్మూర్తి సర్వే తీరును పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డిజిటల్ కార్డుల కోసం నిర్వహిస్తున్న ఈ సర్వే మూడు రోజుల పాటు కొనసాగుతుందన్నారు. కుటుంబ సభ్యుల వివరాలు, ఆధార్‌కార్డు నంబరు తదితర వివరాలను నమోదు చేస్తారన్నారు. ఈ డిజిటల్ కార్డులు సంక్షేమ పథకాలు పొందడానికి ఉపయోగపడతాయని ప్రభుత్వం చెబుతోందని తెలిపారు. ఎంపీడీఓ జయరాం, తహసీల్దార్ అనంతరెడ్డి, సూపరింటెండెంట్ శంకరయ్య, పంచాయతీ కార్యదర్శులు తిరుపతి, మహేశ్, కార్తీక్ పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోండి

డిజిటల్ కార్డుల వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని దుబ్బాక మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత సూచించారు. దుబ్బాక మున్సిపల్ పరిధిలోని చెల్లాపూర్ 2వ వార్డులో కౌన్సిలర్ దేవలక్ష్మి, తహసీల్దార్ వెంకటరెడ్డి, కమిషనర్ రమేశ్ కుమార్‌తో కలిసి డిజిటల్ కార్డు సర్వేను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీఓ నరేందర్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ సందీప్ తదితర అధికారులున్నారు. నంగునూరు మండలం నాగరాజుపల్లిలో అధికారులు సర్వే ప్రారంభించారు. తహసీల్దార్ సరిత, ఎంపీడీఓ లక్ష్మణప్ప, ఎంపీఓ సత్యనారాయణ పంచాయతీ కార్యదర్శులు, సిబ్బందితో కలసి మూడు బృందాలు ఇంటింట సర్వే చేపట్టారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఈనెల 8వరకు సర్వే నిర్వహించి ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ పరిధిలోని ముట్రాజ్‌పల్లిలోని 17వ వార్డులో మున్సిపల్ చైర్మన్ ఎన్సీ రాజమౌళి, కమిషనర్ గోల్కొండ నర్సయ్య సర్వేను ప్రారంభించారు. కౌన్సిలర్ దుంబాల లక్ష్మి, అధికారులు పాల్గొన్నారు. హుస్నాబాద్‌లో నిర్వహించిన సర్వేలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ మాట్లాడుతూ డిజిటల్ కార్డు ద్వారా 30శాఖల సేవలు అందుతాయన్నారు. కౌన్సిలర్ శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు. దుబ్బాకరూరల్ నిర్వహించిన సర్వేలో ఎంపీడీఓలు భాస్కరశర్మ, గణేశ్‌రెడ్డి, మిరుదొడ్డి తహసీల్దార్ వీరేశం తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తున్న మోదీ

సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లారెడ్డి

కొమురవెల్లి(సిద్దిపేట): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను విస్మరిస్తూ కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తోందని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి ఆరోపించారు. మండల కేంద్రంలో గురువారం గ్రామశాఖ మహాసభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ దేశంలో పెరిగిన నిత్యావసరాల ధరలను అరికట్టడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. మరో పక్క రైతులను మోసం చేస్తూ మత విద్వేషాలు రెచ్చగొట్టి పాలిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం గ్రామ కార్యదర్శిగా యాదయ్య, టెంపుల్ కార్యదర్శిగా రవీందర్, షోషల్ మీడియా కన్వీనర్‌గా దయానంద్‌ను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. సత్తిరెడ్డి, కృష్ణారెడ్డి, శారద, రవీందర్, ఇస్తారి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ బస్సు నడపాలని వినతి



ములుగు(గజ్వేల్): మండలంలోని ఆయా గ్రామాలకు ఆర్టీసీ బస్సులు నడపాలంటూ బీజేపీ మండల అధ్యక్షుడు మన్నె శ్రీనివాస్‌యాదవ్‌తో పాటు పలువురు నాయకులు మేడ్చెల్ డిపో మేనేజర్ సుధాకర్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. మేడ్చెల్ నుంచి వయా బండమైలారం, వంటిమామిడి ద్వారా సికింద్రాబాద్ వరకు బస్సు నడపాలని కోరారు. నాయకులు భాస్కర్‌యాదవ్, సాయిగౌడ్, దత్తుగౌడ్, అంజిరెడ్డి, స్వామియాదవ్, దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

◆ మంత్రికి ఘన స్వాగతం

ములుగు(గజ్వేల్): గజ్వేల్ పర్యటనకు వెళ్తున్న రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు ములుగు మండలం వంటిమామిడి వద్ద కాంగ్రెస్ నేతలు గురువారం ఘన స్వాగతం పలికారు. నాయకులు మంత్రిని శాలువాలతో సత్కరించారు. పీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్ రావు, సీనియర్ నాయకులు శ్రీనివాస్‌గుప్త, యాదగిరి, గోపాల్‌రావు, భూపాల్‌రెడ్డి, నల్ల శ్రీనివాస్, నహీమొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

◆ భవిష్యత్ నాశనం చేసుకోవద్దు: సీఐ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): యువత మత్తు పదార్థలకు బానిసలై బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని టూటౌన్ సీఐ ఉపేందర్ సూచించారు. కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాంలో భాగంగా గురువారం కేసీఆర్ నగర్ డబుల్ బెడ్రూం కాలనీలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గంజాయి, డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాలు, సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆయన వెంట త్రీటౌన్ ఎస్ఐ విద్యాసాగర్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

◆ ప్రభుత్వ పాఠశాలల్లోనే గుణాత్మకమైన విద్య

మిరుదొడ్డి(దుబ్బాక): విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలల్లోనే గుణాత్మకమైన విద్య అందుతోందని ఎంఈఓ ప్రవీణ్ బాబు అన్నారు. మండల వనరుల కేంద్రానికి చేరుకున్న పార్టు-2 పాఠ్యపుస్తకాలను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్ఏ-1 పరీక్షల అనంతరం విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్సీ సిబ్బంది కిష్టయ్య, మతిన్ సిబ్బంది పాల్గొన్నారు.

◆ పాఠశాలపై చర్యలు తీసుకోండి

సిద్దిపేటజోన్: సెలవుల్లో పాఠశాల నడుపుతున్న శ్రీచైతన్య విద్యా సంస్థపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ ప్రయివేటు టీచర్స్ ఫోరం అధ్యక్షుడు శ్రీనివాస్ గురువారం డిమాండ్ చేశారు. అక్టోబర్ 2నుంచి 14వరకు దసరా సందర్భంగా ప్రభుత్వం పాఠశాలలకు సెలవులు ప్రకటించగా వారు మాత్రం తరగతులు నిర్వహిస్తున్నారని మండిపడ్డారు. సెలవులు అమలు చేయాలని, లేకపోతే డీఈఓ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

◆ 75మంది వృద్ధులకు వైద్యపరీక్షలు

కొండపాక(గజ్వేల్): అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక ఆనంద నిలయంలో గురువారం ఉచిత వైద్యపరీక్షలు నిర్వహించారు. 75మంది వృద్ధులకు పరీక్షలుచేసి మందులను అందజేశారు. ప్రోగ్రాం అధికారి నారాయణ రావు మాట్లాడుతూ వృద్ధులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. వైద్యాధికారులు శ్రీధర్, ఫరీనా, రమణ, రాజేందర్, రమణ, సంధ్య, నాగరాణి, రాజకుమారి పాల్గొన్నారు.

◆ రైతు డిక్లరేషన్ అమలు చేయాలి

సిద్దిపేటకమాన్: ఎన్నికల ముందు ప్రకటించిన రైతు డిక్లరేషన్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు జస్వంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. ప్రెస్‌క్లబ్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ 5న 'చలో కామారెడ్డి' కార్యక్రమం నిర్వహించనున్నామని చెప్పారు. చంద్రం, నగేశ్, రాములు, దుర్గారెడ్డి పాల్గొన్నారు.

◆ కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం



సిద్దిపేటజోన్: రాష్ట్ర మంత్రి కొండా సురేఖపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ జిల్లా కేంద్రంలో గురువారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. స్థానిక ముస్తాబాద్ చౌరస్తాలో కాంగ్రెస్ మహిళ జిల్లా అధ్యక్షురాలు లక్ష్మి ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఆమె మాట్లాడుతూ కేటీఆర్ వ్యాఖ్యలు మహిళలను అవమానపరిచేలా ఉన్నాయని, వెంటనే ఆయన క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.